## బిజెపి జాతీయ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి



బిజెపి జాతీయ అధ్యక్షుని కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి కలిశారు. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా తెలంగాణకు విచ్చేసిన నితిన్‌నబిన్‌ను బుధవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్ ఫోర్ట్‌లో స్వాగతించి, ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ బలోపేతం, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించిన్నట్లు అంజిరెడ్డి తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## ఎన్నికల కౌంటింగ్ హాల్‌ను పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్



వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ

**రామాయంపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపల్‌లోని రెండో సాధారణ ఎన్నికల సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ బుధవారం ఎలక్షన్ జరిగే కేంద్రంలో సందర్శించారు. అనంతరం కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషను, రిసెప్షన్ సెంటర్లను పరిశీలించారు. అక్కడి అధికారులకు ఎలక్షన్ జరుగు సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకట్ రాజా గౌడ్, ఎంపీడీవో సాజీలుద్దీన్, ఎస్ఐ బాలరాజు, మున్సిపల్ మేనేజర్ రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## తెలంగాణాలో మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

### సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు

**నర్సాపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** తెలంగాణాలో మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ కళ్యాణ మండపంలో మున్సిపల్ ఎన్నికలపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే సునీతరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హరీష్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందింది అంటే బిఆర్ఎస్ ప్రభుత్వంలోనేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 700 రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నర్సాపూర్ మున్సిపాలిటీకి ఒక్క పైసా ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా డబ్బులుపెట్టి గెలవాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ బిజెపి నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో ఆంధ్రాకు మూటలు ఇచ్చి తెలంగాణకు మొండిచేయి ఇచ్చిందని విమర్శించారు. ఏమి చేయని బిజెపి నాయకులకు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. నర్సాపూర్ అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీచేస్తున్న 15 మంది వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను సభావేదికకు పరిచయం చేసి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ జెడ్పి కోఆప్షన్‌మెంబర్ మన్సూర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు సింగయ్యపల్లి గోపి, సంతోష్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి శివకుమార్, శేఖర్ కౌన్సిలర్ అభ్యర్థులు నాయకులు, కార్యక్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే గ్రామాలకు నిజమైన వెలుగు

### టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**కొండాపూర్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** గ్రామాల అభివృద్ధి మాటల్లో కాదు.. పనుల్లో కనిపిస్తోందని, అది కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమవుతోందని టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి భావోద్వేగంగా తెలిపారు. గ్రామీణ ప్రజల అవసరాలను గుండెల్లో పెట్టుకుని ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆమె పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ మండల పరిధిలోని గంగారం, సీతారాంకుంట తండా, అదేతండా, అలియాబాద్ గ్రామాల పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణానికి ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల చొప్పున నిధులతో చేపట్టిన పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. చిన్నారుల భద్రత, విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎన్ఆర్‌జిఎస్ పథకం కింద రూ. 90 లక్షలు విడుదలైనట్లు చెప్పారు. అలాగే తోగర్‌పల్లి, మల్కాపూర్ గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది, మహిళ బలపడితేనే సమాజం ముందుకు సాగుతుంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్ని, మహిళల్ని, పేదల్ని కేంద్రంగా చేసుకుని పాలన చేస్తోంది" అని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆమె స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధి ద్వారా పిల్లలకు సురక్షితమైన వాతావరణం, మహిళా సమాఖ్య భవనాల ద్వారా మహిళలకు ఆత్మవిశ్వాసం, ఉపాధి హామీ పనుల ద్వారా పేదలకు భరోసా లభిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రజల కలలను నిజం చేయడమే కాంగ్రెస్ పాలన లక్ష్యమని ఆమె భావోద్వేగంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ అలవేలి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

### కార్మిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

**మెదక్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త ప్రతినిధి**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం మెదక్ పట్టణం 14, 15, 30వ వార్డుల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలు చేస్తామని, పదేండ్లు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామని చెప్పి మిషన్ భగీరథ పేరు తో 65 వేల కోట్లు మింగింద్రు అన్నారు. గతంలో పేదలు రేషన్‌లో ఇచ్చే దొడ్డుబియ్యం తినలేక అమ్ము కునేవారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మంచి భోజనం చేయాలని సన్న బియ్యం ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, మన ప్రభుత్వం వచ్చాకే అందరికి అర్హులైన రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగించారని తెలిపారు. వచ్చే రెండు నెలల్లో అర్హులైన వారందరికి పెన్షన్లు ఇస్తామని పేర్కొన్నారు. మెదక్ నియోజక వర్గానికి రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇచ్చామని, మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మెదక్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో ఇక్కడ చదువుకొని డాక్టర్లు అయ్యే మంచి అవకాశం ఏర్పడిందని వివరించారు. మీరు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే సీఎంతో కొట్లాడి పనులు చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థులు దొంతి నరేష్, లక్ష్మిలను గెలి పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభు త్వం పదేండ్లు ఇళ్ళు ఇస్తామని ప్రజలను మోసం చేసిందని అన్నారు. మన ప్రజా ప్రభుత్వం రాగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, మరి కొందరికి రెండవ విడతతో ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు పదేళ్ల తర్వాత ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కొత్తగా రేషన్ కార్డు ఇవ్వడమే కాకుండా ఇచ్చిన వాటితో పాటు గతంలో ఉన్న రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క కులాన్ని, మతాన్ని అందరిని సమానంగా చూసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వం ఎన్నిక ల్లో ఓడిపోతున్నామనే భయంతో ఓట్లు వేసుకునేం దుకు రైతుబంధు డబ్బులు వేశారని అన్నారు. ఏడుపాయలకు గతంలో ఏ సీఎం రాలేదని, మన సీఎం రేవంత్‌రెడ్డి ఆలయానికి వచ్చి 35 కోట్ల అభి వృద్ధి పనులకు నిధులిచ్చారని చెప్పారు. గత పాల కులు ఏడుపాయలకు 100 కోట్లు ఇస్తామని చెప్పారని, కానీ పేపర్లకే పరిమితమైంది ఎద్దేవా చేశారు. బిఆర్ఆర్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మెదక్ చర్చికి ఒక్క రూపాయి ఇవ్వాలె, మన సీఎం రేవంత్ చర్చి 29.30 కోట్లు ఇచ్చారని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు మన ప్రభుత్వం వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడామని, వరదలు వస్తే సీఎం రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి, వరదల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పో యిన వ్యక్తులకు పరిహారం ఇచ్చారని అన్నారు. ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తా మని, ఏప్రభుత్వం ఇచ్చిన ప్రజల డబ్బులే అన్నారు. బి ఆర్ ఎస్ హాయంలో నిధులన్నీ సిద్దిపేటకు, గజ్వేల్‌కు, సిరిసిల్ల కు మాత్రమే ఇచ్చారని విమర్శిం చారు. మెదక్ నియోజకవర్గంలో సొంత నిధులతో గతంలో రెండువేల బోర్లు వేశామని అన్నారు. ఇప్పటి నుంచి మెదక్‌లో హరీష్‌రావు ఆటలు చెల్లవు అని, అభివృద్ధికి అడ్డుకునే ప్రయత్నం ఊరుకునేది లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్‌రావు, మాజీఎమ్మెల్యే హనుమంతరావు, డిసిసి అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, మాజీ మున్సి పల్ చైర్మన్ చంద్రపాల్ మాజీ కౌన్సిలర్లు, 14, 15, 30వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు దొంతి లక్ష్మీ ముత్యం గౌడ్, నరేష్ గౌడ్, అరుణర్తి వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నర్సాపూర్ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి...**

**నర్సాపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర కార్మిక శాఖ మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నర్సాపూర్ రూపురేఖలు మారాలంటే కాంగ్రెస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించి నర్సాపూర్ మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యక్తలు అందరూ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలన్నారు. అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల కడుపులో తలపెట్టి ఓటు అడగాలని సూచించారు నర్సాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తే తను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఎన్జీవో కాలనీలో రెండు, మూడు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఆవుల రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, కౌన్సిలర్ అభ్యర్థులు పైడి శ్రీధర్ గుప్తా, సుధీర్‌గౌడ్, రశీద్, రిజ్వాన్, దావుద్, నాయకులు, కార్యక్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు పోలింగ్, కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు

### సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో ఎన్నికలు జరగనున్న చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీల ఎన్నికల పోలింగ్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఇతర పోలింగ్ సిబ్బందిని రెండవ విడత ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో కేటాయించినట్లు తెలిపారు. చేర్యాల మున్సిపాలిటీకి 122, హుస్నాబాద్ 200, దుబ్బాక 205, గజ్వేల్ 364 మంది సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. అలాగే ప్రతిమున్సిపాలిటీకి రిజర్వ్ ఎన్నికల పోలింగ్ అధికారులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. సిబ్బందికి ఈనెల 7న కలెక్టరేట్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ విధానంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 13న నిర్వహించనున్న మున్సిపల్ పోలింగ్ ఓట్లలెక్కింపు సిబ్బందిని రాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు వివరించారు. చేర్యాల 26, హుస్నాబాద్ 26, దుబ్బాక 26, గజ్వేల్ 40 మంది సిబ్బందితో పాటు 20 శాతం అదనపు సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయించారు. కౌంటింగ్ సిబ్బందికి ఈనెల 9న కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్‌ఖానం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ గోడలు**

**మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి...**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ గోడలు, అవసరం ఉన్నచోట మరుగుదొడ్ల నిర్మాణాలను యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంజిఎన్ఆర్‌ఈజీఎస్ పథకంలో నిర్మాణంలోఉన్న పనులు, ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఆయా శాఖల అధికారులో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆయా గ్రామాలలో ఎంజిఎన్ఆర్‌ఈజీఎస్‌కింద చేపట్టిన పనులు అంగన్ వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, సబ్ సెంటర్, గ్రామ మహిళా సమాఖ్య, ఫుడ్‌గ్రైన్ స్టోరేజ్, ఆయా పాఠశాలలో ప్రహరిగోడ, మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. పాఠశాలల ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన ఈజీఎస్ పనులు పూర్తి చేసి ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న పనులు ఈనెల చివరికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి జయదేవ్‌ఆర్య, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రాష్ట్ర గురుకుల విద్యాలయాల పేరెంట్స్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మృతి

**కొండపాక, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నర్సింలు మంగళవారం ప్రజ్ఞాపూర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అయన అంత్యక్రియలు తన స్వగ్రామం దుద్దెడలో బుధవారం నిర్వహించగా గురుకుల విద్యాలయాల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, గురుకుల విద్యాలయాల పెరెంట్స్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బులు, సెల్‌ఫోన్‌లు

## జూదం ఆడుతున్న నలుగురి అరెస్ట్

### ఐదు వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి, ప్రభాతవార్త :** పట్టణ శివారులోని ఆరెపల్లి ప్రాంతంలో అక్రమంగా జూదం(పేకాట) ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిద్ధిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసుల సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో నిందితులు పట్టుబడ్డారు. వారినుంచి రూ. 5,850 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుల వివరాలు వెల్లడించారు. నిందితులలో హుస్నాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మ్యాన వేణు, బుడగజంగాల కాలనీకి చెందిన సిరిగిరి నారాయణ, తుర్నాటి సునీల, పొట్లపల్లి గ్రామానికి చెందిన మల్లేశంలపై ఎస్ఐ లక్ష్మారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే 8712667445, 8712667447, 8712667352 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు చోరీ

**చేర్యాల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చుంచన్నకోటలో ఓ మహిళ మెడలొంచి బంగారుగొలుసు చోరీకి గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన మంద గాలమ్మ(60) వృద్ధురాలు ఇంట్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంటికి వచ్చి దాహం వేస్తుంది నీళ్ల ఇవ్వమని అడిగినట్లు తెలిపారు. మంచి నీరు ఇవ్వగానే వృద్ధురాలి మెడలో ఉన్న 2.5 తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకుని ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పది మందికి రూ.లక్ష జరిమానా

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త):**

మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి రూ.లక్ష జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పది మందిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపిన 9 మందికి రూ.45వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి



మృతి చెందిన గేదె

**చౌటకూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార :** చౌటకూరు శివారులో విద్యుత్ షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృతి చెందాయి. హత్నూర మండలం కొన్యాల గ్రామ రైతు వీరారెడ్డికి చెందిన రెండు పాడి గేదెలు మంగళవారం మేత మేయడానికి మంజీర నదిని దాటి ఇవతలి వైపునకు వచ్చాయి. అయితే, చౌటకూర్ గ్రామానికి చెందిన పోతులబొగుడ వీరయ్యకు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన దాసరి సాయిలు కౌలుకు తీసుకుని శనగ, తెల్ల కుసుమ పంట సాగు చేస్తున్నారు. అడవి పందుల బెడద నుండి రక్షించుకునేందుకు పంట చుట్టు తీగను చుట్టి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. మంజీర నదిని దాటుకుని పాడి గేదెలు మేత మేయడానికి వచ్చి విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందాయి. మేత మేయడానికి వెళ్లిన పాడిగేదెలు కనిపించక పోవడంతో సదరు యజమాని వీరారెడ్డి వెతకగా, పంట పొలంలో తీగలు తగిలి మృతి చెంది కనిపించాయి. ఈ విషయమై బాధితుడు బుధవారం గ్రామ సర్పంచ్ పార్కల రాంరెడ్డికి దృష్టికి తీసుకువచ్చి పంచాయతీ నిర్వహించారు. పంట పొలానికి తీగ చుట్టి కరంటు కనెక్షన్ ఇవ్వడం వల్లే పాడి గేదెలు మృతి చెందాయని తనకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు కాగా, ఇరు గ్రామాల పెద్దల మధ్య రాజీ కుదర లేదు.

# నేతలకు మున్సి'పోల్' సవాల్...!

### పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నాలు..

### రంగంలోకి దిగుతున్న నేతలు నేరుగా కార్యకర్తలకు ఫోన్లు.. బుజ్జగింపులు..

### పార్టీల అభ్యర్థులను గెలిపించుకునేందుకు పక్కా ప్లాన్



**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు మునిసిపల్ ఎన్నికలు సవాల్‌గా మారుతున్నాయి. వార్డుల్లో కార్యకర్తల మధ్య సమన్వయం కుదిరించి గెలిపించుకోవడం అంత సులువైన పనేమి కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ధీటైన అభ్యర్థులను బరిలోకి దింపి మద్దతుగా నిలుస్తున్నా ఓటర్లు ఏ మేరకు అండగా నిలుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అయినా ఎన్నికల్లో విజయం సాధించేందుకు పక్కాప్లాన్‌తో పార్టీలు ముందుకెళ్తున్నాయి. రెబల్స్ పోటీ నుంచి తప్పుకోవాలంటూ బుజ్జగింపు చేశారు. బల్దియా ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటున్న నేతలు పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకు సాగుతున్నారు. కొంత మంది అభ్యర్థులను విత్‌డ్రా చేయించేందుకు నేతలు పడరానిపాట్లు పడ్డారు. ఏది అడిగినా కాదు. కూడదు అనకుండా ముందుకెళ్లి రాజీకుదిర్చారు. మెజార్టీ వార్డులను దక్కించుకుని పార్టీ ఆధిష్టానం వద్ద మరింత పలుకుడిని దక్కించుకునేందుకు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. సాధారణంగానే స్థానిక ఎన్నికలు అధికార పార్టీకి కొంత అనుకూలంగానే ఉంటాయన్న టాక్ విన్పిస్తోంది. నామినేషన్ల విత్‌డ్రాలు ముగిసిపోవడంతో పట్టణ రాజకీయం రసవత్తరంగా జరగనుంది. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 19 మునిసిపాలిటీలున్నాయి. 403 వార్డులు, 1,662 మంది అభ్యర్థులు బరిలోఉన్నారు.

**ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పోటా పోటీ ఎంఐఎం, సీపీఎం, సీపీఐ, జనసేన, బీఎస్పీ, ఆప్,ఎఐఎఫ్బీ, స్వతంత్రులు సైతం..**

మున్సిపల్ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఉపసంహరణల గడువు ముగిసింది. దీంతో బరిలో నిలిచేవారి లెక్క తేలింది. అన్ని వార్డుల్లోనూ బిఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరికి దీటుగా ప్రధాన పార్టీల రెబల్స్, స్వతంత్రులు సైతం బరిలో నిలిచారు. విత్‌డ్రా వేళ మున్సిపాలిటీల్లో అనేక నాటకీయ పరిణామాలు. చోటుచేసుకున్నాయి. ఒకే పార్టీ నుంచి నామినేషన్ వేసిన వారిలో బీఫాం దక్కని వారిని నామినేషన్ విత్ డ్రా చేసుకునేలా ఒప్పించేందుకు ముఖ్య నేతలు అష్టకష్టాలు పడ్డారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 19 మున్సిపాలిటీల్లో 408 వార్డుల నుంచి 1662 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

## నవోదయలో ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**వర్గల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్లో 9, 11వ తరగతిలో ప్రవేశానికై ఈనెల 7వ తేదీ శనివారం ఎంపిక పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 9వ తరగతికి 4, 11వ తరగతికి 4 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 11వ తరగతి ఎంపిక పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 9వ తరగతికి ఉదయం 11.15 గంటల నుండి మధ్యాహ్నం 1.45 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలన్నీ గజ్వేల్, ప్రజ్ఞాపూర్తో పాటు వర్గల్ జవహర్ నవోదయలో ఉన్నాయని తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశానికై 1008, 9వ తరగతికి 853 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్లైన్లో హాల్టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, పరిశీలకులకు ఈనెల 5వ తేదీ గురువారం నవోదయ విద్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రవేశ ఎంపిక పరీక్ష ఇంచార్జ్ శ్రీనివాసరావుతో పాటు విద్యాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

## స్వయంపాలన దినోత్సవ వేడుకలు



స్వయంపాలన జరుపుకున్న విద్యార్థులు

**మెదక్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండలపరిధి శాలిపేట జడ్పి ఉన్నతపాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీకాంత్, బాలరాజు, హరిత, భవాని, జయశ్రీలు పాల్గొన్నారు.

## చేరిలాలో నూతన గ్రామపంచాయతీకి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచి బంజ లావణ్యరవి తదితరులు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
మండలంలోని నూతనంగా ఏర్పడ్డ చేరిలా గ్రామంలో బుధవారం నూతన గ్రామపంచాయతీ కోసం సర్పంచి బంజ లావణ్యరవి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీల కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని అందుకుగాను నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, సత్యనారాయణ, బిక్షపతి, దాకులు, తుపాకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ బరిలో 99మంది అభ్యర్థులు

**సదాశివపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
సదాశివపేట మున్సిపల్బరిలో వివిధపార్టీలకు చెందిన 99మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్నికల అధికారి శివాజీ తెలిపారు. మొత్తం 26 వార్డులకు కాంగ్రెస్, టిఆర్ఎస్ పోటీ చేస్తుండగా బిజెపి 21, సిపిఎం 1, ఎంఐఎం 5, జనసేన పార్టీ 2, ఇతర పార్టీ ఒకటి, ఇండిపెండెంట్లు 17మంది పోటీచేస్తున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పార్టీ టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా రంగంలోకి దిగడంతో ప్రధానపార్టీల భవితవ్యం గందరగోళంలో పడింది. ఈ ఎన్నికల్లో బిజెపికూడా అధిక స్థానాలలో పోటీచేయడం వల్ల ఫలితాలలో పార్టీ ప్రభావం చూపనుంది. ప్రచారానికి ఐదురోజులు మాత్రమే గడువు ఉండడంతో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. పదవ వార్డు బిజెపి అభ్యర్థి చంద్రశేఖర్ తనను గెలిపిస్తే మునవార్డుకు ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసువారు తనిఖీలు ముమ్మురంచేశారు.

## లోనికలాన్లో మద్యనిషేధం

-గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



మద్య నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

**మునిపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలం లోనికలాన్లో బుధవారం మద్యనిషేధం అమలుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానించారు. గ్రామంలో మద్యం అమ్మకాలు చేపట్టరాదని సర్పంచి హన్మంత్రాజు అధ్యక్షతన సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎవరైనా గ్రామంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించినా, మద్యంసేవించి గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేసినా జరిమానా విధించబడుతుందన్నారు. అంతేకాకుండా గ్రామంలో 18సంవత్సరాలలోపు పిల్లలకు సిగరెట్లు, బీడీలు, గుట్కాలు అమ్మినవారిపై కఠినచర్యలు తీసుకోబడుతాయని తీర్మానంలో పేర్కొన్నారు.

## పెద్దమ్మతల్లి ఆలయానికి రూ.50వేల విరాళం

**ములుగు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
ములుగు మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ బహిలంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి కొమురవెల్లి డైరెక్టర్ పల్లె మహేష్యాదవ్ బుధవారం రూ.50వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా పల్లె మహేష్యాదవ్ మాట్లాడుతూ ఆలయనిర్మాణానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
సిద్దిపేట పట్టణంలోని మెరిడియన్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్కూల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఉచిత కంటిపరీక్షల శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో అనుభవజ్ఞులైన నేత్రవైద్యుల సహకారంతో విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి సూచనలు, మందులు అందించారు. కళ్ళద్దాలు అవసరం ఉన్న వారిని గుర్తించి తగిన మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్రెడ్డి, రాజావెంకటరెడ్డి, ప్రిన్సిపల్ అంబటి మహేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** బాగ్ అంబర్పేట్లోని పాములబస్తీ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్రెడ్డితో కలిసి ప్రారంభించారు. సుమారు 16 లక్షల వ్యయంతో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను వారు బుధవారం ఉదయం లాంఛనంగా శంకుస్థాపన చేశారు.

# సామాజిక సేవ మనందరి బాధ్యత

-ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**వర్గల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రాంసాగర్పల్లి, నెంటూర్, గోవిందాపూర్ గ్రామాలలో గత వారం రోజులుగా జరిగిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి హాజరై మాట్లాడారు. గత ఏడు రోజులుగా ఆయా గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ విద్యా వాలంటీర్లు చేసిన సేవలు ఆదర్శనీయమని అన్నారు. ఇలాంటి సేవలు మరెన్నో చేసి మీరు సమాజానికి, దేశానికి మరింత ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్ఎస్ఎస్ అంటేనే సామాజిక సేవకు అంకితమని గుర్తుచేశారు. సామాజిక సేవ మనందరి బాధ్యత అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నికత్ అంజుమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పెద్దిరాజు, డాక్టర్ వై.రామచంద్రం, డాక్టర్ మహేందర్, గోవిందాపూర్ సర్పంచి బీమ్రెడ్డి, నెంటూర్ సర్పంచి నాగరాజు, ఉపసర్పంచులు ప్రదీప్, కృష్ణ, నవీన్, ఎస్.గణపతిరావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ భవాని, డాక్టర్ మహేందర్ రెడ్డి, చాంద్, శివ, మార్కండేయ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

-కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి మాచునూరి లక్ష్మీరాజు

**నర్సాపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో, 5వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిని మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ను గెలిపించాలని గడపగడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు శివాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ప్రస్తుతం జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తేనే నర్సాపూర్ మున్సిపాలిటీ అన్నిరంగాలలో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా, మండల అధ్యక్షులు మల్లేష్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, నాయకులు మల్లేష్యాదవ్, సురేష్యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించి గెలిపించండి.. అభివృద్ధిని చేసి చూపిస్తా..

-3వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థిని ఆఫ్రీన్



ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న ఆఫ్రీన్, దావూద్, రిజ్వాన్

**నర్సాపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు ప్రజలు నన్ను ఆశీర్వదించి గెలిపించినట్లయితే 3వ వార్డును మరింత అభివృద్ధిచేస్తానని 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిని ఆఫ్రీన్ అన్నారు. బుధవారం 3వ వార్డులో అభ్యర్థిని ఆఫ్రీన్తో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, నర్సాపూర్ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రశీద్, కాంగ్రెస్ నాయకులు దావూద్లు పర్యటించి ఇంటింటికి తిరిగి చేతిగుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డుప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్గౌడ్, మాధవరెడ్డిలకు అవకాశం ఇవ్వాలి

-ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసిన నాలుగు బస్తీల పెద్దలు

**అత్తాపూర్ ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో మైలార్దేవ్పల్లి, కాటేదన్ డివిజనులకు సంబంధించిన కార్పొరేటర్ టికెట్ను బిసినేత, సీనియర్ నాయకుడు సుధాకర్గౌడ్కు కేటాయించి తమ బస్తీనేతలకు ఒక్క అవకాశం కల్పించాలని పలువురు నేతలు ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్కు విజ్ఞప్తిచేశారు. బుధవారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని నేతాజీనగర్లో బుద్వేల్ రైల్వే స్టేషన్, వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్నగర్, నేతాజీనగర్కు చెందిన నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సీనియర్ నేత సుధాకర్ గౌడ్, మాధవరెడ్డిలకు టికెట్ కేటాయించేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ముక్తకంఠంతో సుమారు 150మంది బస్తీపెద్దలు తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... తమ కాలనీల అభివృద్ధి కోసం ఈసారి కార్పొరేటర్ టికెట్ను బిసి రిజర్వేషన్ ప్రకారం సుధాకర్గౌడ్, జనరల్ రిజర్వేషన్ ప్రకారం మాధవరెడ్డిలకు కేటాయించాలని తీర్మానం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ కృష్ణగౌడ్, మాధవరెడ్డి, సుధాకర్గౌడ్, కుమార్యాదవ్, దత్తు, కరుణాకర్గౌడ్, డా.కృష్ణ, డా.మురళిజైపాల్, గణేష్గౌడ్, నారాయణ, శివ, స్వామిగౌడ్, తిరుమల వెంకటేష్గౌడ్, సురేష్సాగర్, వెంకటేష్, శేఖర్, చిరంజీవి, ప్రభాకర్గౌడ్, శ్రీనివాస్, గోపి, ఎల్లప్ప, యాదిరెడ్డి, భిమేష్రెడ్డి, మన్నెంరెడ్డి, మల్లేష్, అంజయ్య, శ్రీకాంత్గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు మరణశాసనంగా లేబర్ కోడ్స్: సిఐటియు

**నిజాంపేట్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులకు మరణశాసనమని, వాటిని వెంటనే రద్దుచేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఈ నెల 12వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ, ప్రచార కార్యక్రమాలు, నిరసన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోకోకోలా చౌరస్తా, అరబిందో ఫార్మా లైన్, బాచుపల్లి, బొల్లారం చౌరస్తా తదితర పారిశ్రామిక ప్రాంత కూడళ్లలో సమ్మెప్రచారం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగు లేబర్కోడ్స్ అమలుతో సంఘటిత, అసంఘటిత కార్మికులు మాత్రమే కాకుండా వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. కార్పొరేట్లకు లాభాలు చేకూర్చేలా కార్మికచట్టాలను కేంద్రప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుని, పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితమయ్యే హక్కు, నిరసనలు, సమ్మెచేసే హక్కులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. ఉద్యోగ భద్రత పట్ల యాజమాన్యాల బాధ్యత పూర్తిగా తొలగిపోయిందని, కనీస వేతనాలు, పర్మినెంట్ ఉద్యోగాల అమలు దెబ్బతిన్నదని ఈసందర్భంగా తెలిపారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంసిపిఐ నాయకులు రాంబాబు, ఎఐసిటియు నాయకులు దానయ్య, సిఐటియు నాయకులు గోవర్ధన్రెడ్డి, జోయల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపనుల్లో నాణ్యత పాటించాలి

-కార్పొరేటర్ మంజుల రఘునాథ్రెడ్డి

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
అభివృద్ధిపనుల్లో నాణ్యతను పాటించటంతోపాటు వేగవంతంగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజులరఘునాథ్రెడ్డి సూచించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్రెడ్డి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శంకర్నగర్, సత్యఎన్క్లేవ్, ఫ్రెండ్స్కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న డ్రైనేజీ, సిసిరోడ్లపనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంజులరఘునాథ్రెడ్డి మాట్లాడుతూ.. చందానగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపనుల అమలులో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అధికారులు ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులను వేగవంతంచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పనిలోనూ కచ్చితమైన నాణ్యతను పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. నాణ్యత పాటించని, పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని కోరారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ డివిజన్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కస్తూర్బాగాంధీ ట్రస్టుకు రూ.4లక్షల వితరణ

**నార్సింగి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
హైదర్షాకోట్ డివిజన్లో ఉన్న కస్తూర్బాగాంధీ ట్రస్టు మేనేజర్ మూర్తికి లక్ష్మీబాయి రూ.4.లక్షలను అందజేశారు. లక్ష్మీబాయి సోదరికూతురు లావణ్యబాయి అమెరికానుంచి వచ్చినప్పుడు కస్తూర్బాగాంధీ ట్రస్టును సందర్శించారు. ట్రస్టులో ఉన్న అనాథబాలికలు, మతిస్థిమితంలేని మహిళలను చూసి వీరికి తనవంతు ఆర్థికసహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే రూ.4.లక్షలను ఆమె తన చిన్నమ్మ లక్ష్మీబాయికి పంపించారు. లక్ష్మీబాయి ఈ రూ.4.లక్షలను మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్రెడ్డితో కలిసి ట్రస్టు ప్రతినిధులకు అందజేశారు. వారికి ట్రస్టు మేనేజర్లు మూర్తి, శ్రీనివాస్రావ్లు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు రవికాంత్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నితిన్ నబిన్ సభకు తరలిన బిజెపి నేతలు

**నార్సింగి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ తొలిసారిగా మహబూబ్నగర్లో జరిగే విజయసంకల్పయాత్రకు బుధవారం వచ్చారు. ఈసభలో పాల్గొనేందుకు బండ్లగూడ డివిజన్కు సంబంధించిన బిజెపి నాయకులు పెద్ద ఎత్తున ఆరె మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలమూరు సభ విజయవంతం కావాలని, పాలమూరు మున్సిపాలిటీలో బిజెపి జయకేతనం ఎగురవేయాలని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భారత్మాతాకి జై, నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలని నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ పాలమూరు బహిరంగసభకు తరలివెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్కు ఘనస్వాగతం పలికారు. తెలంగాణలో తొలిసారిగా పాలమూరు సభకు నితిన్ నబిన్ వచ్చారని, అక్కడ బిజెపిని గెలిపించి ఆయనకు కానుకగా ఇచ్చేందుకు శక్తివంచనలేకుండా కష్టపడుతామని బిజెపి నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపి కొండా విశ్వేశ్వర్రెడ్డి, రాష్ట్రనాయకులు భీమార్జున్రెడ్డి, మహాలింగంగౌడ్, రంగారెడ్డి జిల్లా నాయకులు నీరుడు శేఖర్ముదిరాజ్, దామోదర్రెడ్డి, శ్రీనివాస్రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేష్, పవన్సాయి, స్వామి, విఠల్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.82కోట్లతో అభివృద్ధిపనులు ప్రారంభం

-ప్రారంభించిన ఎమ్మెల్యే నవీన్యాదవ్

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్లో దాదాపు రూ.1.82 కోట్ల విలువైన పనులను బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు నవీన్యాదవ్ ప్రారంభోత్సవం చేశారు. డివిజన్లోని శ్రీనగర్కాలనీ పరిధిలో ఉన్న జయప్రకాష్నగర్లో రూ.28 లక్షలతో సిసి రోడ్లు, అంబేద్కర్ నగర్లో రూ.38 లక్షలతో సిసి రోడ్లు, బిగ్బజార్ వ్యాల్యూ మార్ట్ దగ్గర రూ.30లక్షలతో సిసి రోడ్లు, న్యూసైన్స్ కాలనీలో ఉద్యానవనానికి రూ.38లక్షలతో పునరుద్ధరణ పనులు, అంబేద్కర్నగర్లో రూ.48 లక్షలతో బస్తీ దవాఖానా, సామాజిక భవనం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సోమాజిగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. స్థానికుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి రోజు తాను డివిజన్లో అందుబాటులో ఉంటానని, అన్ని ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్పార్టీ నేతలు వనం శ్రీనివాస్యాదవ్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కుట్టి వెల్లోడి ఆస్పత్రి భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
సీతాఫలమండీలో నిర్మిస్తున్న కుట్టి వెల్లోడీ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావుగౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.12కోట్ల ఖర్చుతో వంద పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న సీతాఫలమండీ ఆసుపత్రి నిర్మాణం పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రోగులకు మంచిసేవలు అందించేలా అసుపత్రిని తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, సమన్వయకర్త రాజాసుందర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

-ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
పేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ అండగా నిలుస్తున్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఫిల్మ్నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ డివిజన్లకు చెందిన లబ్దిదారులకు అందించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ 40చెక్కులు అందించగా, ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి 20చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, ఫిల్మ్నగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగ్రావు, రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ రూట్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్

12 వాహనాలు సీజ్ చేసిన మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు

**కొండాపూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
ప్రజల ప్రాణభద్రతను దృష్టిలో ఉంచుకుని రాంగ్రూట్లో ప్రయాణించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సిపి ఆదేశాల మేరకు మంగళవారం మియాపూర్ పరిధిలోని కౌసల్యకాలనీ యూటర్న్వద్ద ప్రత్యేక ట్రాఫిక్డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్ను మియాపూర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, ఎస్ఐపి విఠల్రెడ్డితో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి చేపట్టారు. డ్రైవ్ సమయంలో రాంగ్ రూట్లో ప్రయాణిస్తున్న వాహనాలపై నిఘాపెంచి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 11 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ కలిపి మొత్తం 12 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బాచుపల్లి పోలీస్ స్టేషన్కు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. రాంగ్రూట్లో వాహనాలు నడపడంవల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే ప్రమాదం ఉందని, అలాగే సాధారణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై ఇలాంటి ప్రత్యేక డ్రైవ్లు కొనసాగిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

## సమాజ శ్రేయస్సుకు పాటుపడేవారికి తప్పకుండా గుర్తింపు

**బేగంబజార్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ జియాగూడ ప్రాంతానికి చెందిన గోగికర్ నరేష్ సమాజ్ అభివృద్ధి పట్ల, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో చురుకైన పాత్రపోషించడం మూలంగానే ఈ అవార్డుకు ఎంపికయ్యారు. బిహార్ రాష్ట్రంలో జరిగిన విక్షిత్ భారత్నేషనల్ యూత్ సమ్మిట్ జరిగిన కార్యక్రమంలో జియాగూడకు చెందిన స్వచ్ఛందసంస్థ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న గోగికర్ నరేష్ను వికసిత్ భారత్ నేషనల్ యూత్ సమ్మిట్ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా తెలంగాణ మహాత్మా జ్యోతిరావుపూలే యువమంచ్ అధ్యక్షులు కె.ఎం.గురుచరణ్, కార్యదర్శి ఎం.ప్రభాకర్, యువనాయకులు పి.మహేందర్లు గోగికర్ నరేష్కు అవార్డు రావడం పట్ల అభినందించారు. సమాజం పట్ల నిబద్ధత, సామాజిక అవగాహన ఉన్నవ్యక్తి, సామాజిక బాధ్యత, యువత భాగ్యస్వామ్యం కోసం నిరంతరం కృషిచేస్తున్నట్లు చెప్పారు. విద్య, అవగాహన, సామూహిక చర్యపై బలమైన నమ్మకంతో, స్థానిక స్థాయిలో సానుకూల మార్పు ప్రోత్సహించే కార్యక్రమాలకు ఆయన ముందువరుసలో ఉంటారని వారు గుర్తు చేశారు.

## హైదరాబాద్లో "గ్లోబల్ సోలార్ ఎక్స్పో "

ఈనెల 6,7 తేదీల్లో హైటెక్స్లో నిర్వహణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
గ్లోబల్ సోలర్ ఎక్స్పోకు హైదరాబాద్ వేదికైంది. ఫిబ్రవరి 6,7 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరగనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్కు 10,000మందికి పైగా సందర్శకులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గ్లోవర్ సోలార్ ఎక్స్పో ఫౌండర్ ఆనంద్గుప్త మాట్లాడుతూ ఇది దక్షిణభారతదేశంలో సోలార్రంగానికి సంబంధించిన అతిపెద్ద సమావేశంగా నిలవనుందన్నారు. ఇది సోలార్ రంగంలో పాలసీ, వ్యాపారం, సాంకేతికతల సమ్మేళనగా భావిస్తున్నామన్నారు. ఈవెంట్ దక్షిణభారతదేశంలో పునరుత్పాదకశక్తి రంగాన్ని కొత్తదశకు తీసుకెళ్తుందని అన్నారు. ఇందులో సోలార్ ప్రదర్శన, సూర్యాకాన్ కాన్ఫరెన్స్, తెలంగాణ సోలార్ అవార్డులు, బయ్యర్-సెల్లర్ మీట్ వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమానికి ఎనర్జీశాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్, టిజిఈఆర్సి కమిషనర్ సెక్రటరీ, టిజిఎస్పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ, ఆపరేషన్స్ డైరెక్టర్ డా.ఎన్.నరసింహులు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## ఆసియాక్రీడల దిశగా తెలంగాణ సెయిలర్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
సరైన ప్రోత్సాహం, పట్టుదల ఉంటే ఏస్థాయికైనా ఎదగవచ్చని నిరూపిస్తున్నారు తెలంగాణకు చెందిన ఇద్దరు బాలికలు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన సురగాని ఈశ్వ, కొమ్మరవెల్లి లహరి ఇప్పుడు సెయిలింగ్ క్రీడలో అద్భుతాలు సృష్టిస్తూ, 2026 ఆసియా క్రీడల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే దిశగా దూసుకెళ్తున్నారు. ఆసియా గేమ్స్ కోసం ఈ ఇద్దరు క్రీడాకారిణులు తమ మెంటర్, కోచ్ సుహైమ్ షేక్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం లహరి "స్కిప్పర్"గా, ఈశ్వ "క్రూ"గా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరూ ఈ ఏడాది జపాన్లోని నగోయాలో జరగనున్న ఆసియాక్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే రాబోయే అంతర్జాతీయ సర్క్యూట్లలో తమ సత్తా చాటగలిగితే, ఆసియా క్రీడల బెర్త్ ఖరారవుతుంది. ఈసందర్భంగా యాట్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ సుహైమ్ షేక్ మాట్లాడుతూ.. లహరి ఇప్పటికే ఎంతో అనుభవం సంపాదించింది, కానీ ఈశ్వ తక్కువ సమయంలోనే అద్భుతమైన ప్రతిభ కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిద్దరూ సెలక్షన్ ట్రయల్స్లో అగ్రస్థానంలో నిలిచారు. ఒలింపియన్ గణపతి కేలపాండ వీరికి మార్గనిర్దేశం చేయడం విశేషం అని అన్నారు.

**సురగాని ఈశ్వ..**
యాదాద్రిభువనగిరి జిల్లా, మోటకొండూర్ మండల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల (బాలికలు) విద్యార్థిని సురగాని ఈశ్వ (14) కథ స్ఫూర్తిదాయకం. చిలుకూరు గ్రామానికి చెందిన ఈశ్వ 2017లో రోడ్డుప్రమాదంలో తండ్రిని కోల్పోయింది. కుటుంబభారం అంతా తల్లి మాధవిపై పడింది. రోజుకు కేవలం రూ. 300 కూలీపని చేస్తూ, పిల్లల చదువుకోసం ఆమె వారిని గురుకుల పాఠ శాలలో చేర్పించింది. 2025 ఏప్రిల్లో ఈశ్వజీవితం మలుపు తిరిగింది. యాట్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థు లకు అందించిన సెయిలింగ్ శిక్షణలో ఈశ్వ ఎంపికైంది.

**కొమ్మరవెల్లి లహరి..**
సికింద్రాబాద్లోని ఉద్భవ్ స్కూల్లో చదువుతున్న 15 ఏళ్ల లహరి కథ కూడా అంతే ఆసక్తికరం. సిద్దిపేటజిల్లా నుంచి పొట్టకూటికోసం హైదరాబాద్ వలసవచ్చిన కుటుంబం ఆమెది. అనారోగ్యంతో తండ్రి ఇంటికే పరిమితంకాగా, తల్లి కవిత కష్టపడి కుటుంబాన్ని పోషిస్తోంది. 2022 లో, తన 11వ ఏట లహరి సెయిలింగ్ వైపు అడుగులేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఆమెలోని ఏకాగ్రత, క్రమశిక్షణ ఆమెను విజేతగా నిలిపాయి.

## పార్లమెంటులో కుట్రపూరితంగా రాహుల్ గాంధీని అడ్డుకుంటున్నారు

-యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్రెడ్డి

**సైఫాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
పార్లమెంటులో రాహుల్గాంధీ నోరు విప్పితే తమ చీకటి ఒప్పందాలు బయటకు వస్తాయనే కుట్రతో మోదీ, అమిత్షాలు రాహుల్గాంధీని మాట్లాడకుండా అడ్డుకుంటున్నారని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్లో రాహుల్గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవటంపై ఆగ్రహం వ్యక్తంచేసిన యూత్ కాంగ్రెస్ హైదరాబాద్లోని సెక్రటేరియట్ముందున్న రాజీవ్గాంధీవిగ్రహం నుంచి ట్యాంక్బండ్ అంబేద్కర్విగ్రహం వరకు నిరసనర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కో ఇన్చా ర్జులు రోష్నిజైస్వాల్, భవ్యా, లీగల్సెల్ చైర్మన్ నిఖిల్రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యాం చరణ్రెడ్డి, శక్తి సూపర్ షీ స్టేట్ కోఆర్డినేటర్ విద్యారెడ్డి, హరిదార్, విశాల్, అనీష్ పాల్గొన్నారు.

## మహనీయుడు పింగళి వెంకయ్య

-ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాళేశ్వరం శంకరం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఆజన్మాంతం భరతమాత సేవలో తరించిన మహనీయుడు పింగళి వెంకయ్య అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు. బుధవారం ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలోభాగంగా భారత జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య యాదిసభ బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన గానసభలోని కళాలలిత కళావేదికలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాళేశ్వరం శంకరం హాజరయ్యారు. కార్యక్రమంలో యువకళావాహినిసంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ప్రముఖ గాయకుడు రామోజీ, గానసభ జీవితకాల సభ్యుడు శంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త :** మండల పరిధిలోని తడకపల్లి శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆచార్యులుగా, అధికారులుగా వ్యవహరించారు. స్వపరిపాలనలో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు పాఠశాల కార్యదర్శి మంతపురి నారాయణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు మద్దుల నవీన్, ఆచార్యులు పాల్గొన్నారు.

## 'విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి'



బహుమతులు అందిస్తున్న సర్పంచ్ ఓజాల్‌యాదవ్ తదితరులు

**నంగునూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** విద్యార్థులు బాగాచదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ పోతారబోయిన ఓజాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని పాలమాకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డిఈవోగా యుగేందర్, డిప్యూటీ డిఈవోగా సాహితి, ఎంఈవోగా అక్షయ, హెచ్ఎంగా గుండెల్లి రిషిత, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. జనవరి 26న నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ బహుమతులు అందించారు. టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని నేల్లుట్ల సత్యం, పోర్ల రాజులు అందించారు. అనంతరం పాఠశాల సిబ్బంది సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు మహబూబ్ అలీ, రమణారెడ్డి, పార్థసారథి, నాగరాజ, హరికృష్ణ, మురళీధర్‌రెడ్డి, యాదయ్య, యాదమ్మ, రాజు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిధుల మంజూరు


వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

**కోహెడ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పలు అభివృద్ధి పనులకు రూ.161 లక్షల నిధులు మంజూరు చేస్తూ పరిపాలన ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్ యార్డులో కవర్డ్ షెడ్డు నిర్మాణానికి రూ.101 లక్షలు, డ్రైయింగ్ ప్లాట్ ఫాం నిర్మాణానికి రూ.47 లక్షలు, కూరగాయల మార్కెట్ 1వ అంతస్తులో చైర్మన్ ఛాంబర్, మీటింగ్ హాల్ నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరయ్యాయి. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు వచ్చినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్, నిధులు కేటాయించిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మార్కెట్ యార్డు పాలక వర్గం కృతజ్ఞతలు తెలిపారు.

## కెప్టెన్ చౌడు తండాలో గ్రామసభ

### అభివృద్ధి అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు


తండాలో గ్రామసభ దృశ్యం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కెప్టెన్ చౌడుతండాలో బుధవారం గ్రామస్తులతోకలిసి సర్పంచ్ గుగులోత్ స్వరూప రాజునాయక్ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. గ్రామసభలో అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ప్రధానంగా తాగునీటి సమస్య, పంచాయతీ భవనం నిర్మాణం, పాఠశాల ప్రహరీగోడ, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని గ్రామసభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోత్ అర్జున్‌నాయక్, గ్రామ కార్యదర్శి లక్ష్మీకాంతారావు, వార్డ్ మెంబర్లు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మిషన్ భగీరథ అధికారులు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు.బుదవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు చేపట్టే ఎన్నికల ఖర్చులు ఏ విధంగా చేయాలి, ఖర్చు చేసిన వివరాలను ఎలాంటి విధానంలో నమోదు చేసి సంబంధిత అధికారులకు సమర్పించాలి అనే అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను కచ్చితంగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ నిశాంతి, (ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్), అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్, అబ్జర్వర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు హుస్నాబాద్ ఏసీపీ సొదారపు సదానందం, సీఐ కొండ్ర శ్రీనివాస్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి పాల్గొని అభ్యర్థులకు మార్గనిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్‌గౌడ్

# గుమ్మడిదలలో ఓటర్లను మభ్యపెట్టే జాతర ప్రారంభం!

### గల్లీ గల్లీలో మద్యం, డబ్బు, విందుల ఆర్బాటాలు




**గుమ్మడిదల ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

గుమ్మడిదల మున్సి పాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఆశావాహులు, గత పది రోజుల నుంచి ఓటర్ అమాయకులను మద్యం విందు మత్తులో ముంచుతూ లేపుతున్నారు. గుమ్మడిదల మున్సి పాలిటీలో ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే ఓటర్ల మభ్యపెట్టే జాతర బహిరంగంగా కొనసాగుతోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, వార్డు సభ్యులు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అనైతిక మార్గాలను ఎంచుకుంటున్నారు. గల్లీ గల్లీకి మద్యం సరఫరా, చేతిచేతికి డబ్బుల పంపిణీ, రాత్రివేళ విందు అర్బాటాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. ప్రజా సమస్యలు, అభివృద్ధి హామీలు పక్కనపెట్టి తను ఎలాగైనా గెలవాలనే ఆశతో ఓటును కొనుగోలు చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఓటరు అనే పవిత్ర హక్కును మద్యం సీసాలు, నోట్ల కట్టలతో తూకం వేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా సంబంధిత అధికారులు కళ్లుమూసుకున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అక్రమాలకు తక్షణమే అడ్డుకట్ట వేయకపోతే రానున్న ఎన్నికలు ధనబలం–మద్యం బలంతో మసకబారిపోతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం, జిల్లా అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని గుమ్మడిదల మున్సి పాలిటీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

## నేటి సమాజానికి యోగా అవసరం..ఎంపిడివో

**రామాయంపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** క్రీడలు మానసికోల్లాసాన్ని పెంచడంతోపాటు జీవిత అభ్యున్నతిలో ఎంతో దోహదపడతాయని ఎంపీడీవో షాజీలుద్దీన్ అన్నారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బుధవారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేవలం మండల స్థాయిలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించి రామాయంపేట మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, చెస్, యోగ మొదలైన క్రీడలలో విజయం సాధించిన వివిధ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమ, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు నాగచందర్, యోగా శిక్షకులు మద్దెల భరత్, శేఖర్, అనిల్, మధు తదితరులు పాల్గొన్నారు.

## నమ్మించి గొంతుకోసారు..

### కన్నీటి పర్యంతమైన బిఆర్ఎస్ రెబల్ అభ్యర్థిని బాలమణి రాములు

**రామాయంపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** గృహిణిగా ఉన్న నన్ను బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు నమ్మించి గొంతు కోసారని, పార్టీ టికెట్ నీకే ఇస్తామని నమ్మించి నన్ను నట్టేట ముంచారంటూ బీఆర్ఎస్ పార్టీ 5వ వార్డు రెబల్ అభ్యర్థిని చింతల బాలమణి రాములు కన్నీటి పర్యంతమయ్యారు. బీఫామ్ దక్కనందున టికెట్ ఆశించి భంగపడ్డ బాలమణి బుధవారం మీడియా సమావేశంలో భావోద్వేగంతో మాట్లాడారు. సాధారణ గృహిణిగా ఉన్న నన్ను ప్రచారం చేసుకోమని చెప్పి, తీరా తాను ఓటర్ల కాళ్లు సైతం మొక్కుతూ ప్రచారం చేసుకున్నానని, నామినేషన్ ఉపసంహరణ సమయానికి వేరే పార్టీనుండి వచ్చిన వ్యక్తికి టికెట్ కేటాయించి, తనను తప్పుకోమనడం మీకు న్యాయమా అంటూ నిలదీసారు. ఒక ఆడపడుచుకు అన్యాయం చేసిన ఉసురు ఊరికే పోదంటూ బోరున విలపించారు. మొదట్లో పార్టీకి అభ్యర్థులే దొరకని సమయంలో..తాను ఐదో వార్డ్ నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే పద్మా రెడ్డి మాట ఇచ్చారన్నారు. ఆ నమ్మకంతో నేను నా భర్త కుమారులతో కలిసి ఇంటింటికి తిరిగి బొట్టు పెట్టి ప్రచారం చేసుకున్నాక.. ఇప్పుడు మరొకరికి బీఫామ్ ఇచ్చి మోసం చేశారంటూ ఉసూరుమన్నారు. అయినప్పటికీ తాను పోటీ నుంచి తప్పుకునేదే లేదని, ఎన్ని అడ్డంకులు వచ్చినా తట్టుకొని బీఆర్ఎస్ రెబర్ అభ్యర్థిగా రంగంలోకి దిగి విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రెబర్ అభ్యర్థి బాలమణి రాములు దంపతులు


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నగర మేయర్ గద్వాల్

## ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు

### జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త :** మహా నగర అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మీ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం డివిజన్ పరిధిలో రూ.40.70 కోట్ల అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవనికి స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో పలు ప్రారంభోత్సవాలకు, శంకుస్థాపనలకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, భారతి నగర్ కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డిల తోకలిసి ముఖ్యఅతిథిగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ హాజరయ్యారు. అందులో భాగంగా రామచంద్రాపురం శ్రీనివాస్‌నగర్ కాలనీ పరిధిలో ఉన్న సోమేశ్వర ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్, రామచంద్రపురంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డివిజన్లో అభివృద్ధి కొరకు నూతన మంజూరు, శ్రీనివాస్ నగర్‌లో గాంధీ బాలవిహార్ పార్క్, ఓల్డ్ రామచంద్రాపురంలో మీట్ మార్కెట్, రాయసముద్రం చెరువు సుందరీకరణ హెచ్ఎండిఏ, రాయ సముద్రం చెరువులో మురికి నీరు మళ్లించాడనికి, రామచంద్రారెడ్డి నగర్ లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాకతీయ నగర్ కాలనీలో థీమ్ పార్క్ (హెచ్ఎండీఏ), కాకతీయనగర్ కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ తో కలిసి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ..నగరం నలువైపులా విస్తరిస్తున్నదు వల్ల జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేశామని తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రామాయంపేటలోకి ప్రవేశించిన సత్యసాయిబాబా రథోత్సవం

**రామాయంపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** పట్టణంలో బుధవారం శ్రీ సత్యసాయిబాబా "ప్రేమ ప్రవాహిని" రథోత్సవం జరిగినది. రథోత్సవానికి ప్రజలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా బాధ్యులు డిపి శిరిగె ప్రభాకర్, వి.సాయిబాబా, రామాయంపేట సమితి కన్వీనర్. వైశంకరయ్య, యెనిశెట్టి గౌరిశంకర్, భక్తులు పాల్గొన్నారు.


సాయిబాబా రథానికి స్వాగతం పలుకున్న మహిళలు

# మహాజాతరలో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలి

### సమష్టి, సమన్వయంతో పనులు చేపట్టాలి.. నీటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**పాపన్నపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** సమష్టి, సమన్వయంతో పనులు చేపట్టి జాతర ఖ్యాతి నలు దిశలా చాటేలా ఏర్పాట్లు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం మహా శివరాత్రి మహా జాతర నిర్వహణ పనుల పురోగతిపై హరిత రెస్టారెంట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17వ తేదీవరకు మూడు రోజులపాటు జరిగే జాతర ఏర్పాట్లు నలుదిశలా చాటిచెప్పేలా చేయాలని ఆదేశించారు. భక్తులకు శాశ్వత సౌకర్యాల కల్పన దిశగా 13 వరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. జాతరలో పారిశుధ్యానికి పెద్దపీట వేసి పారిశుధ్య రహిత జాతరగా నిలపాలని చెప్పారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతర విజయవంతం చేయాలని సూచించారు. బారికేడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, సరిపడా బస్సులు నడపాలని, గజ ఈతగాళ్లు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లుచేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. భక్తులు స్నానాలు ఆచరించడానికి 12 షవర్లతోపాటు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేసి ఈ నెల 10 వరకు సింగూరు ప్రాజెక్టు నుంచి నీటితో ఘనపూర్ ఆనకట్ట చేరేలా చర్యలు తీసుకున్నట్లు ఇరిగేషన్ ఈఈ పేర్కొన్నారు. భక్తులకు జేబియస్ నుంచి 150 బస్సులతోపాటు బాలానగర్ నుండి 135, నారాయణఖేడ్, జహీరాబాద్ నుండి 99 బస్సులను మూడు రోజుల పాటు నడుపనున్నట్లు ఆమె తెలిపారు. డిజిటల్ స్రీన్, సీసీ కెమెరాలతో అనుక్షణం అప్రమత్తంగా ఉండేలా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు. తొమ్మిది టీమ్‌లతో పాటు రెండు మొబైల్ టీంలు, రెండు చెక్ పోస్టులు ఏర్పాటుచేసి మద్యం షాపులు లేకుండా ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ అధికారి పేర్కొన్నారు. ఏడుపాయల ఆలయంలో జరిగే పూజలలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అలాగే మత్స్య శాఖ ఆధ్వర్యంలో 150 మంది గజ ఈతగాళ్లఏర్పాటు చేయన్నట్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 5 ప్రదేశాలలో క్యాంపులు, నాలుగు 108 అంబులెన్సులు, లక్ష వోఆర్ఎస్ ప్యాకెట్లు, అంత్యవసర మందులు, 28 మంది డాక్టర్లు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ 4, 80 మంది ఆయుష్ డాక్టర్లు, ఏఎన్ఎంలు 100, ఇతర వైద్య సిబ్బంది మొత్తం 300 మంది పనిచేస్తారని తెలిపారు. టేకులగడ్డ బస్టాండ్ నుండి 10 ఉచిత మినీ బస్సులు తిరుగుతాయి తెలిపారు. మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో 144 నల్లాలు, 45 మంది మానిటరింగ్ చేస్తారని,400 మంది కార్మికులు, 498 మరుగు దొడ్లు, వాటర్ ట్యాంకర్లు 40, ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా 18 మంది సెక్టార్ అధికారులు,180 మంది పంచాయతీ కార్యదర్శులు,640 మంది మల్టీ పర్పస్ కార్మికులు,రెండు షిఫ్టుల్లో పని చేయనున్నారు. 13 తేదీ నుంచి 18 వ తేదీ వరకు పనులు చేయనున్నారు. డస్ట్‌బిన్స్, బ్లీచింగ్ పౌడర్, పాగింగ్ చేయనున్నారు.జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు 4 డీఎస్పీలు, 23 మంది సీఐలు, 80 మంది ఎస్సైలు, 45 మంది ఏఎస్సైలు, 96 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 250 మంది కానిస్టేబుళ్లు, 84 మంది మహిళా కానిస్టేబుళ్లు, 234 మంది హోంగార్డులు, 14 మంది మహిళా హోంగార్డులు మొత్తం 829 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, నాగ్సన్పల్లి సర్పంచ్ సుశీల, ఆలయ కార్యనిర్వహణ అధికారి, వీరేశం, తాసిల్దార్ సతీష్‌కుమార్, కొల్చారం తాసిల్దార్ శ్రీనివాస చారి, వివిధ శాఖల జిల్లా అధికారులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్, తాగునీటి సౌకర్యాలను ప్రారంభిస్తున్న దృశ్యం

## తండాలలో విద్యుత్, తాగునీటి సౌకర్యాలు ప్రారంభం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైసమ్మ వాగుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పాండవుల గుట్ట ప్రాంతానికి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు రంగన్నకుంట తండాకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధుల నుంచి మూడు లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేయగా బోరు మోటార్, విద్యుత్ పోల్స్, కలెక్షన్ పనులను బుదవారం ప్రారంభించినట్లు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తెలిపారు. బోరు మోటార్, విద్యుత్ పోల్స్, కలెక్షన్‌లను ఆయన స్వయంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు అవసరమైన విద్యుత్, తాగునీటి సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి, మున్సిపల్ ఎలక్షన్ ప్రభాహరి విజయ్ కుమార్, నాయకులు జనగామ వేణుగోపాలరావు, కర్ణకంటి నరేష్, మాజీ సందవేనా కుమార్, రాజేందర్ నాయక్, చెరుకు సంపత్, రవికుమార్, మోహన్ నాయక్, సంతోష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులకు భూమి పూజ


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిడివో తదితరులు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గురువన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించ తలపెట్టిన ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపిడివో లక్ష్మప్ప బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పనులు నాణ్యత లోపించకుండా త్వరగా పూర్తి చేయాలని ఎంపిడివో సూచించారు. పనుల్లో నాణ్యతలోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జహంగీర్, ఉపసర్పంచ్ సతీష్, హెచ్ఎంలు రాజు, రమేష్, ఎఎపిసి చైర్మన్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గురువన్నపేట గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్బంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులు డాక్టర్ సూచనలు విధిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ అనూష


అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలని సర్పంచ్ పచ్చిమడ్ల అనూష అన్నారు. మండల పరిధిలోని రసూలాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలందరికీ ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు కలిగిన ఆహారాన్ని తప్పని సరిగా తీసుకోవాలన్నారు.గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ తమ పిల్లలను ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించి ప్రభుత్వం అందిస్తున్న ఆహారాన్ని తీసుకునేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకవస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమాదేవి, ఉపసర్పంచ్ సుదర్శన్, స్వామిగౌడ్, అంగన్‌వాడీ టీచర్ భారతి, వార్డు సభ్యులు మల్లేశం, పర్శరాములు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌కు చెక్ - ప్రకృతి పరిరక్షణకు వైజ్ఞానిక యాత్ర

**చౌటకూర్ ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ప్లాస్టిక్‌కు చెక్ – ప్రకృతి పరిరక్షణకు వైజ్ఞానికతపై ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.చౌట్కూర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రకృతి వైజ్ఞానిక యాత్ర ఆరోవరోజు కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం కెమికల్స్ వాడకం తగ్గించి ప్రకృతి, సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుందాం, భారత రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం" అనే సందేశంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి ప్రజాకవి జయరాజ్, సామాజిక శాస్త్రవేత్త రమేష్, ప్రిన్సిపల్ రాఘవేంద్రరావు, రాష్ట్ర అధ్యక్షులు విజయ్, తెలంగాణ శ్యామ్, అమ్మ అవయవ దాన సంస్థ స్థాపకులు శంభో లింగం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు. ప్రజాకవి జయరాజ్ ప్రజా శాస్త్రవేత్త రమేష్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రకృతి మన జీవనానికి ఆధారం అని, దాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని, ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వైజ్ఞానిక దృక్పథం అంధవిశ్వాసాలకు ప్రత్యామ్నాయంగా ఉండాలని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భారత రాజ్యాంగానికి మూలస్తంభాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి తీవ్ర హానికరం అని, భూమిలో వందల నుంచి లక్షల సంవత్సరాల వరకు కరుగకుండా ఉండి జీవరాసులకు ప్రమాదం కలిగిస్తుందని పేర్కొన్నారు.ప్లాస్టిక్ పెన్నులు, బాటిళ్లు, వస్తువులకు బదులుగా పేపర్ పెన్నులు, స్టీల్, రాగి వంటి సహజ వస్తువుల వినియోగం పెంచాలని పిలుపునిచ్చారు. పాలిప్రొపైలిన్ వంటి కెమికల్స్ ఆరోగ్యానికి ప్రమాదకరమని, క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణమయ్యే అవకాశం ఉందని తెలిపారు. విజ్ఞాన దర్శిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆలీ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు శోభా రాణి, మంగక్క, విజ్ఞాన దర్శిని నాయకత్వంలో పేపర్ పెన్నుల వినియోగాన్ని ప్రారంభించి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యా సంస్థలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని, విద్యాసంస్థల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించి పేపర్ పెన్నుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్యావరణవేత్త

## ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..

-11వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిని రుక్మిణిగోపాల్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న అభ్యర్థి రుక్మిణీగోపాల్‌రెడ్డి

**నారాయణేడ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
ఆదరించండి.. అభివృద్ధి చేస్తానని 11వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిని రుక్మిణీ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం 11వ వార్డులో ముమ్మరంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో వారితోపాటు యూత్ కాంగ్రెస్ నాయకులు విక్రమ్ లాల్, శివపటేల్, సాయిచరణ్, దిగ్వాల్ సాయి, గోపాల్‌రెడ్డి, చింటూ, విజయ్‌కుమార్‌స్వామి, బేలూరి సాయిరెడ్డి, సాగర్‌లాల్, సంజీవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధారెడ్డి, మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి పొన్న రాజేందర్‌రెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
మున్సిపల్ ఎన్నికలలో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియ దంతో బరిలో ఉండే అభ్యర్థుల తుదిజాబితా తేలిపోవడంతో, సంగారెడ్డి మున్సిపాలిటీపరిధిలో ఎన్నికలప్రచారం జోరందుకుంది. అయావార్డులలో పోటీచేస్తున్న అభ్యర్థులు తమప్రచారాన్ని ముమ్మరంచేయడంతో సంగారెడ్డి మున్సిపాలిటీ పట్టణపరిధిలో ఎన్నికల కోలాహలం నెలకొంది. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో 38వార్డులకు, 226మంది నామినేషన్లు సక్రమం గా దాఖలుచేయగా, అందులో నామినేషన్ల చివరితేదీ మంగళవారం నాటికి 50మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ప్రస్తుతం 176 మంది బరిలో ఉన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలు 38వార్డులలో పోటీ చేస్తుండగా, ఎంఐఎం 13వార్డులలో, బిజెపి 34, సిపిఎం ఒకచోట, ఆమ్ ఆద్మీ పార్టీ ఒక చోట, బిఎస్పీ రెండు చోట్ల, స్వతంత్ర అభ్యర్థులు 45చోట్ల బరిలో ఉన్నారు. అభ్యర్థులు ఉదయం నుంచి ఇంటింటి ప్రచారాన్ని మొదలుపెట్టి రాత్రి 10 గంటలవరకు కొనసాగిస్తున్నారు. వార్డులలో పార్టీ కార్యాలయాలు ప్రారంభించడంతోపాటు ఎన్నికల ప్రచారంలో తమ అను చరులతో ప్రచారం కొనసాగిస్తుండడంతో మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులలో ఎన్నికల కోలాహలం నెలకొంది.

## చక్రియాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం

-సర్పంచి అనసూయరాజశేఖర్



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**చౌటకూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
చౌటకూర్‌మండలం చక్రియాలగ్రామంలో చేపట్టనున్న వివిధరకాల అభి వృద్ధి పనులకు శ్రీకారంచుట్టినట్లు సర్పంచి చిన్నరోళ్లపాటి అనసూయ రాజశేఖర్ తెలిపారు. ఉపసర్పంచి నార్సింగ్ మొగులయ్యముదిరాజ్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డిలతో కలిసి బుధవారం టెంకాయలుకొట్టి పనులను ప్రారంభించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజ నరసింహ సహకారంతో గ్రామానికి రూ.70 లక్షల నిధులు వివిధ గ్రాంట్ల కింద మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీగోడ, అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం, మరో భవనానికి మరమ్మతు, పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలకు మంత్రి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీఅనంతపద్మనాభ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మణ్, ఎంపిపి మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్, వార్డు సభ్యులు మరియమ్మ, లక్ష్మణ్, శ్రీనివాస్, పావని, శ్రీశైలం, శ్రీకాంత్, జ్యోతి, వెంకటకిష్టాపూర్, సర్పంచులు గణేష్, కుమ్మరి నవనీతఅశోక్, మాజీసర్పంచులు శ్రీనివాసరెడ్డి, బాలాగౌడ్, మాజీ ఎంపిటిసి వెండికోలు రాములు, రేషన్‌డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఉప్పరి దేవదాస్, నాయకులు మాధవరెడ్డి, సత్యనారాయణ, అంజిరెడ్డి, నీరుడి లక్ష్మీ నారాయణ, పండరి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి దళిత వ్యతిరేక పార్టీ

-ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య

**చౌటకూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దళితుల అభ్యున్నతికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య ఆరోపిం చారు. మండల కేంద్రమైన పుల్‌కల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ బిజెపి దళిత వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువయిందన్నారు. దళితులకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విదేశీ విద్య కోసం ప్యాకేజీని పెంచి దళితుల్లో ఉన్న వికలాంగులు. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు పొట్టిపల్లి మొగులయ్య, నక్క సూర్యకుమార్, అరిటి క్యాల శంకరయ్య, పొట్టిగల్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్‌గా నియామకమైన అధ్యాపకులకు సన్మానం



ప్రిన్సిపల్‌గా నియామకమైన అధ్యాపకులను సన్మానిస్తున్న దృశ్యం

**వర్గల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల వర్గల్‌లో ఆంగ్ల సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ షహానా నజీన్ ఎఫ్ఏసి ప్రిన్సిపల్‌గా ఎంజెపి టిజిడబ్ల్యు ఆర్‌డిసి కందుకూరు కళాశాలకు, కెమిస్ట్రీ సీనియర్ అధ్యాప కురాలు డాక్టర్ వి.రాధ, మేడ్చల్ మల్కాజిగిరి మహిళా కళాశాలకు ప్రిన్సి పల్‌గా నియామకం కావడంతో బుధవారం వర్గల్‌లోని కళాశాలలో అధ్యా పకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గడ్డం భాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపల్ పి.గోవిందరావు, ఎటిపి వర్జిని దేదీప్య, డిడబ్ల్యు జయలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం మా తొలి ప్రాధాన్యత

-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
-రూ.కోటి ఇరవై ఒక్క లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
-పటాన్‌చెరులో ఘనంగా ప్రారంభమైన నియోజకవర్గస్థాయి సిఎం కప్ క్రీడలు
-రూ.4కోట్లతో, ఆధునిక వసతులతో ఫంక్షన్‌హాల్ నిర్మాణం



సిఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన కొన సాగిస్తూ ప్రతి ఒక్కరిని అభివృద్ధిలో భాగస్వాము లను చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జెపి కాలనీ, ఎంజి రోడ్డు, నందన్‌రతన్ ప్రైడ్ కాలనీలలో ఒక కోటి 21 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, వరదనీటితరలింపు డ్రెయిన్‌నిర్మాణ పనుల కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న పటాన్‌చెరు డివిజన్‌పరిధిలోని ప్రతికాలనీలో మౌలి క వసతుల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒకరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పృథ్వీరాజ్, వెంకటేష్, పట్టణ ప్రముఖు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గ్రామీణక్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే సిఎం కప్ లక్ష్యం...**
రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో గల పాఠశాలల స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తిం చి, వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభు త్వం ప్రతి ఏటా సిఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహి స్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధి లోని ప్రతి గ్రామంలో విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తిపెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నా మని ఆయన పేర్కొన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన సిఎం కప్ 2025-26 పటాన్‌చెరు నియో జకవర్గస్థాయి క్రీడలను క్రీడాజ్యోతి వెలిగించి ఆయ న లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి సంవత్సరం వివిధ క్రీడాంశాలలో మైత్రి మైదానం వేదికగా జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మండల స్థాయి క్రీడల్లో ఎంపికైన 400 మంది విద్యార్థులు నియోజకవర్గస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటున్నా రని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సిఐ వినాయకరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండలవిద్యాశాఖ అధికారు లు నాగేశ్వరరావునాయక్, రాములు, సుధాకర్, విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, సీని యర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రారంభానికి సిద్ధమైన గోకుల్ ఫంక్షన్ హాల్...**
పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో నాలుగుకోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మి స్తున్న గోకుల్ ఫంక్షన్‌హాల్ పనులు పూర్తయ్యా యని, త్వరలో ప్రారంభించబోతున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం గోకుల్‌నగర్‌లో నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ ను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, యాదవసంఘం ఉపాధ్యక్షులు మల్లేష్‌యాదవ్, రాజన్‌సింగ్, జిహెచ్ఎంసి ఏఈ లావణ్య పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

-సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య



కార్మికులతో రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
మోడీ ప్రభుత్వం అమలుచేస్తున్న కార్మిక, కూలి, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య డిమాండ్‌చేశారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోగల పార్కర్ కార్మికుల గేట్ మీటింగ్‌లో రాజయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదంచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసమ్మె వివిధ కేంద్రకార్మికసంఘాలు, వివిధ ఫెడరేషన్లు, ఇన్సూ రెన్స్, బ్యాంకు, ఎంప్లాయిస్ సంఘాల ఆధ్వర్యంలో భారీయెత్తున జరగ నున్నదని ఆయన అన్నారు, కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపుని చ్చాయని అన్నారు. సమ్మె సందర్భంగా కార్మికులు వివిధ రూపాలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఈసందర్భంగా కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్య, సాయిలు, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలి

**మెదక్ జిల్లా, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలని ప్రాథమిక పాఠశా లల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య ఆరోపించారు. బుధవారం చిన్న శంకరంపేటలో మాట్లాడుతూ జివో 25 ద్వారా ఉపాధ్యాయులపై పనిభారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం విడుదలచేసిన జివో 25ను సవరించాలని డిమాండ్‌చేశారు.

## ప్రచారానికి మద్దతు తెలిపిన బుడగజంగం ప్రజలు



మద్దతు తెలుపుతున్న బుడగజంగం ప్రజలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల్లో బాగంగా 9వ వార్డుకి చెందిన బుడగ జంగాల సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాణాపురం రాజును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని నారాయణ ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి, పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులను కలిసి వారి మద్దతును తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితోపాటు బుడగజంగం సోదరులు, ప్రజలు తదితరులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## ఎఐటియుసి 2026 డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులోగల కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఎఐటియుసి 2026 డైరీని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి చేతులు మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఆవిష్కరణ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రామికుల సంక్షేమం, హక్కుల కోసం ఎఐటియుసి ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఈడైరీ మా కార్యకలా పాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. అంగ న్‌వాడీ సమస్యల పైన ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. త్వరలో మీ సమస్య కూడా పరిష్కారమయ్యే విధంగా సిఎం, మంత్రి సీతక్క దృష్టిలో కూడా ఉందని అన్నారు. మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సొంతభవనాలు లేని గ్రామాలలో కూడా నిర్మించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు భోజీరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, చిరంజీవి, ఎఐటియుసి సభ్యులు, తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## ఖేడ్‌లో బిఆర్ఎస్ జోరుగా ప్రచారం

-నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
ఇంటింటిప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ మంజుశ్రీజయపాల్‌రెడ్డి అన్నారు. మున్సి పల్ ఎన్నికల్లో భాగంగా నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ మంజుశ్రీజయపాల్‌రెడ్డిలు నారాయణఖేడ్ మున్సిపాలిటీలో 5,6,10,12 వార్డులలో ఇంటింటిప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా 5వ వార్డు అభ్యర్థిగా శేఖర్, 6వ వార్డు అభ్యర్థిగా సతీష్ కుమార్, 10వ వార్డు అభ్యర్థిగా సనా సుల్తానా సయ్యద్ ఆసిఫ్, 12వ వార్డు అభ్యర్థిగా పరశురాంలకు ఓట్లను వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వారు మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గల్లీగల్లీకి సిసి రోడ్లను, ప్రతి ఇంటికి తాగడానికి నల్లా కనెక్షన్లు ఇచ్చి నీటిని అందించిన ఘనత మాకే దక్కుతుందని తెలిపారు. కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డిలు కోరారు.

# పాఠశాలల అభివృద్ధికి మరింత కృషి

-ప్రహరీగోడ నిర్మాణానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి శంకుస్థాపన



ఉసిరికపల్లిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**శివంపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
పాఠశాలల అభివృద్ధికి మరింత కృషిచేస్తానని ఎ మ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో చేపట్టిన పాఠశాల ప్రహరీగోడ నిర్మా ణాలకు శివంపేట, ఉసిరికపల్లి గ్రామాలలో సర్పం చులు సుజాతాకృష్ణారెడ్డి, రాజీపేట వెంకటేశ్వర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ మండలంలోని దాదాపు 40 పాఠశాలలకు రూ.3కోట్ల95లక్షలు మంజూరుకాగా, వాటితో ప్రహరీగోడ, వాష్‌రూంల నిర్మాణాలకు పనులు చేపడుతున్నట్లు ఆమె అన్నా రు. విద్యార్థుల రక్షణకోసమే ప్రహరీగోడల నిర్మా ణం చేపడుతున్నామని, గ్రామాలలో అతి తొందర లోనే గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాల కోసం పనులను ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. అసంపూర్తి గా మిగిలిన పనులతోపాటు, గోమారం నుండి పిల్లి కొట్టాల్ వరకు, మిగిలిన ఉన్న దొంతి రోడ్డు నిర్మా ణానికి కూడ నిధులు మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణా గౌడ్, ఎంపిడిఓ వెంకటలక్ష్మమ్మ, మాజీ ఎంపిపి కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పి కోఆప్షన్ మన్సూర్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకటరెడ్డి, ఎపిఓ అనిల్‌కుమార్, సర్పంచులు సుజాతకృష్ణారెడ్డి, వెం కటేశ్వర్, ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఉపసర్పంచులు గుర్రం సురేందర్‌రెడ్డి, ఇసుగారి మల్లేష్, గూడూరు యాదాగౌడ్, తూము కృష్ణారావులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియామాలు తప్పకుండా పాటించాలి..

-టాట్ ఆఫీసర్ ఉప్పరి వినయ్‌కుమార్




మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల టాట్ ఆఫీసర్ ఉప్పరి వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం నారాయణఖేడ్ మున్సిపల్ సమావేశ మందిరంలో మాల్ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయాపార్టీల అభ్యర్థులకు ఎన్నికల్లో మోడల్ ఆఫ్ కండక్ట్ లోని అంశాలైన వాహనాల పర్మిషన్, ఖర్చుల వివరాలు, ప్రచార సమ యాలు, ప్రచారంలో పాటించాల్సిన నియమనిబంధనలు తదితర విష యాలపై వివరించారు. ఈసమావేశంలో మున్సిపల్ మేనేజర్ వెంకట శివయ్య, ఫ్లేయింగ్ స్క్వాడ్ టీమ్ వరప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, ఆయాపార్టీల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు

-కుకునూరుపల్లి ఎస్సై పండుగ శ్రీనివాస్

**కొండపాక, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
ప్రతి వాహనదారుడు రోడ్డు నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలో పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్డుభద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు బైకులు వాహనాలు ఇవ్వ రాదని సూచించారు. మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ఫోర్‌వీలర్లు నడిపేవారు సీటుబెల్ట్ ధరించాలన్నారు. కళాకా రులు పలు అంశాలపై పాటలద్వారా గ్రామస్థులకు అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో సర్పంచి మంచాల నవీన, వార్డుసభ్యులు, గ్రామ స్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతే పాఠశాలలు నడిపించాలి

-ఎంఈవో రాజా ప్రభాకర్‌రెడ్డి

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
సిద్దిపేట పట్టణంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతులు పొందిన తర్వాత మాత్రమే నడిపించాలని మండల విద్యాధికారి రాజాప్రభాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. అనుమతిలేకుండా ఏ పాఠశాలనైనా ముందస్తు అడ్మిషన్లుగాని, ప్రచారంగాని విద్యా సంవత్సరానికి ముందుగా ఎటువంటి చర్యలు చేపట్టరాదన్నారు. పాఠ శాల పేరులో నేషనల్, ఇంటర్నేషనల్, కాన్సెప్ట్ తదితరపేర్లను జోడించ రాదన్నారు. అనుమతులు రాకుండానే ఏర్పాటుచేసిన ప్రచార హోర్డిం గులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు వెంటనే తొలిగించాలన్నారు. జిల్లా కలెక్టర్, డిఈవో ఆదేశాలకు విరుద్ధంగా ఏ పాఠశాల అయినా ప్రవర్తించినట్లయితే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు.

## నువ్వుఅక్కడ ..నేనిక్కడ..

-ఖేడ్ మున్సిపల్‌లో వేర్వేరు వార్డుల్లో భార్యాభర్తల పోటీ




వార్డులకు వేరు వేరుగా పోటీచేస్తున్న భార్యాభర్తలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ రణరంగంలో బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ 2వ వార్డ్‌కు పోటీ చేయగా, ఆమెభర్త అభిషేక్ షెట్కార్ 3వ వార్డ్‌కు బరిలో వున్నారు. అయితే ఖేడ్ మున్సిపాల్టీలో ఎన్నికలవేళ పోటీ ఆసక్తి గా మారి అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. భార్య, భర్త వేరు వేరు వార్డుల్లో బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బిఆర్ఎస్ పార్టీలో స్థానికంగా పట్టున్న నాయకులు కావడంతో, 2వ వార్డులో సీట్లు సాధించారు. నామినేషన్ పర్వం ముగియడంతో ప్రచారంలో దూసు కెళ్తున్నారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వ హయాంలో 2వ వార్డ్ అభ్యర్థి స్వప్న అభిషేక్ షెట్కార్ విజయం సాధించింది. ఇప్పుడు ప్రచారం నిర్వహిస్తూ 3వ వార్డ్ అభ్యర్థిగా తాను, 4వ వార్డ్‌లో తన భర్త బరిలో ఉన్నామని, తమకు అవకాశం ఇచ్చి గెలిపించాలని ఓటర్లను వేడుకుం టున్నారు. ఐతే 3వ వార్డ్ అభ్యర్థినిగా మఠము శైలజాఆనంద్ బరిలో నిలుస్తున్నారు. అదేవిధంగా 4వ వార్డ్ నుండి సీనియర్ కాంగ్రెస్ నాయ కులు, మాజీ వైస్‌చైర్మన్ దారం శంకర్ సైతం బరిలో నిల వడంతో పోటీ రసవత్తరంగా మారనుంది.

## సమాచారం ఇవ్వడంలో అలసత్వం విడనాడాలి



నియామకం పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**
ప్రభుత్వ అధికారుల్లో పాలకులలో జవాబుదారీతనం పడిపోయిందని అవినీతిపరులను కాపాడానికే సకాలంలో సమాచారం ఇవ్వడం లేదని సమాచారహక్కు చట్టం పరిరక్షణకమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం సిద్దిపేటకు చెందిన మన్నె కుమార్‌ను ఉమ్మడి మెదక్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షునిగా నియమించి నియామకం పత్రాన్ని అందజేసి మాట్లాడారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులపైన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దర ఖాస్తుదారులను వేధిస్తూ చివరికి కోర్టుమెట్లు ఎక్కే పరిస్థితి వస్తుం దన్నారు. కార్యక్రమంలో నూతన ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మన్నె కుమార్, తీగుళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రాగిరి రాజు, జోగారి రాజు, ఆర్.స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థుల సహకారంతోనే పాఠశాల అభివృద్ధి

**కొండపాక, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
పాఠశాల అభివృద్ధికి సహకరించిన జక్కుల ఎల్లయ్యను సర్పంచి తిమ్మాపూరం కర్ణాకర్‌రెడ్డ అభినందించారు. బుధవారం ఖమ్మంపల్లి పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జక్కుల ఎల్లయ్య సతిమణి కీ.శే.జక్కుల వెంకటలక్ష్మి జన్మదినం సందర్భంగా ఆమె జ్ఞాప కార్థం పాఠశాలకు ఆయన సౌండ్‌బాక్స్‌ను బహూకరించారు. ఈ సంద ర్భంగా సర్పంచి పాఠశాల అభివృద్ధికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎల్లయ్యను శాలువాతో సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం సైతం ఎల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు విజయేందర్‌రెడ్డి, శ్రీకాంత్, సురేందర్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.